సాక్షి అనంతపురం

ఆదివారం | 6 | జూలై | 2025



టీబీ డ్యాం కళకళ

టీబీ డ్యాం కళకళలాడుతోంది. శనివారం ఇన్‌ఫ్లో 93, 216, అవుట్ ఫ్లో 61,470 క్యూసెక్కులుగా నమోదైంది.



చీనీ టన్ను రూ.19 వేలు

అనంతపురం మార్కెట్‌యార్డులో శనివారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.19 వేలు పలికాయి.

గరిష్టం/కనిష్టం

34.6°/ 23.8°

జిల్లా అంతటా శనివారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి. నైరుతి దిశగా గంటకు 8 నుంచి 16 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

తాడిపత్రి వెళ్తా.. అనుమతివ్వండి

- ఎస్పీకి కేతిరెడ్డి పెద్దారెడ్డి లేఖ



తాడిపత్రిటౌన్: తాడిపత్రి పట్టణానికి వెళ్లేందుకు తనకు అనుమతి కావాలని మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఎస్పీకి లేఖ రాశారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత పోలీస్ ఆంక్షలతో ఆయన తాడిపత్రికి దూరంగా ఉన్న సంగతి తెలిసిందే. పట్టణానికి వెళ్లేందుకు కోర్టులు అనుమతి ఇచ్చినా పోలీసులు వివిధ కారణాలు చూపుతూ అడ్డుకుంటున్న తరుణంలో పెద్దారెడ్డి లేఖ రాయడం ప్రాధాన్యం సంతరించుకుంది. వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశానుసారం రాష్ట్ర వ్యాప్తంగా 'రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో' కార్యక్రమం నిర్వహిస్తున్నారని లేఖలో పెద్దారెడ్డి పేర్కొన్నారు. అందులో భాగంగా తాడిపత్రిలో కార్యక్రమం చేపట్టాల్సి ఉందన్నారు. తాను దాదాపు 3 రోజుల పాటు పట్టణంలో ఉండాల్సి ఉంటుందన్నారు. కావున తాడిపత్రికి వెళ్లేందుకు అనుమతి కావాలని పేర్కొన్నారు.

లోక్ అదాలత్‌లో 10,089 కేసుల పరిష్కారం



మాట్లాడుతున్న ఉమ్మడి జిల్లా ప్రధాన న్యాయమూర్తి భీమారావు

అనంతపురం: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అన్ని కోర్టుల్లోనూ శనివారం నిర్వహించిన లోక్ అదాలత్‌లో 10,089 కేసులు పరిష్కారమయ్యాయి. అనంతపురం జిల్లా కోర్టులో లోక్ అదాలత్‌ను ప్రధాన న్యాయమూర్తి భీమారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. లోక్ అదాలత్ తీర్పుపై అప్పీలుకు అవకాశం ఉండదన్నారు. రెగ్యులర్ కోర్టులో కేసులు పరిష్కారమైతే ఎవరో ఒకరే గెలిచే అవకాశం ఉంటుందని, అదే లోక్ అదాలత్‌లో అయితే ఇరు పార్టీలు సంతోషంగా ఇంటికి చేరుకోవచ్చన్నారు. కార్యక్రమంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఎస్. రాజశేఖర్, మొదటి అదనపు జిల్లా జడ్జి సత్యవాణి, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ గురుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

- ఉమ్మడి జిల్లాలో నిర్వహించిన లోక్ అదాలత్‌లో మోటారు వాహనాల ప్రమాద కేసులు 28 పరిష్కారమయ్యాయి. బాధితులకు రూ.1.57 కోట్ల నష్ట పరిహారం ఇప్పించారు. సివిల్ కేసులు 75 పరిష్కారమయ్యాయి. వీటి విలువ రూ.5,35,59,388. ప్రీలిటిగేషన్ కేసులు 3,876 పరిష్కారం కాగా, ఇందులో మొత్తం రూ.1,98,98,382. ఎన్‌ఐ యాక్ట్ కేసులు- 22 మొత్తం రూ.31,50,000.

రేపు పామిడిలో 'పరిష్కార వేదిక'

అనంతపురం అర్బన్ : ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ఈనెల 7వ తేదీ సోమవారం పామిడి మండల కేంద్రంలో నిర్వహించనున్నట్లు కలెక్టర్ వి.వినోద్‌కుమార్ తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కార్యక్రమం జరుగుతుందన్నారు. అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొంటారని, ప్రజలు తమ సమస్యలను అర్జీ రూపంలో సమర్పించాలని సూచించారు.

1100కు కాల్ చేయండి

అర్జీదారులు 1100కు ఫోన్ చేసి పరిష్కార వేదికలో సమర్పించిన అర్జీ స్థితిని తెలుసుకోవచ్చని కలెక్టర్ తెలిపారు. అదే విధంగా meekosam. ap.gov.in వెబ్‌సైట్‌లోకి వెళ్లి అర్జీలను సమర్పించి పరిష్కారం పొందవచ్చన్నారు.

కోతలు.. ఉత్త చేతులు!

బీటీపీ కాలువ పనులకు మళ్లీ శంకుస్థాపన

- 2018లో సీఎం హోదాలో ఆర్భాటంగా ఫైలాన్ ఆవిష్కరించిన చంద్రబాబు
- నేడు మళ్లీ పనులకు టీడీపీ ప్రజాప్రతినిధుల ప్రారంభోత్సవాలు
- గత టీడీపీ ప్రభుత్వంలో రైతులకు పైసా విదల్చని చంద్రబాబు
- అప్పట్లో ఆర్భాటాలకే రూ.కోట్ల దుర్వినియోగం
- నేడు మళ్లీ పాతరాగం అందుకోవడంపై సర్వత్రా విమర్శలు



"హంద్రీ-నీవా ద్వారా జీడిపల్లికి చేరే కృష్ణా జలాలను జనవరి 2019 నాటికి బీటీ ప్రాజెక్టుకు తరలిస్తాం. కరువు రైతుల కష్టాలు తీరుస్తాం. ఎన్ని ఆటంకాలు ఎదురైనా రైతు సంక్షేమానికి పెద్దపీట వేస్తాం. రాయదుర్గం, కళ్యాణదుర్గం ప్రాంతాల్ని సస్యశ్యామలం చేస్తాం."

- 2018 అక్టోబర్ 10న బీటీపీ వద్ద పైలాన్ ఆవిష్కరణ అనంతరం సభలో సీఎం చంద్రబాబు చెప్పిన మాటలివీ..

సాక్షి టాస్క్‌ఫోర్స్: 'నవ్విపోదురుగాక మాకేటి సిగ్గు అన్న' చందంగా తయారైంది టీడీపీ ప్రజాప్రతినిధుల తీరు. మాటల్లో కోతలు కోస్తున్న వారు చేతల్లో మాత్రం చూపలేకపోతున్నారు. బీటీ ప్రాజెక్టు పూర్తి చేసి రాయదుర్గం, కళ్యాణదుర్గం ప్రాంతాలను సస్యశ్యామలం చేస్తామంటూ 2014 ఎన్నికల్లో చంద్రబాబు హామీ ఇచ్చి ప్రజల ఓట్లు కొల్లగొట్టారు. అయితే, అధికారం చేపట్టాక ఆర్భాటాలతోనే సరిపెట్టారు. సభలు, శంకుస్థాపనల పేరిట రూ.కోట్ల ప్రజాధనం దుర్వినియోగం చేశారు. బీటీపీ అతిథి గృహం వద్ద ఏకంగా రూ.50 లక్షలతో పైలాన్ నిర్మించి ఆవిష్కరించారు. దీనికితోడు శిలాఫలకం ఆవిష్కరణ, సభ తదితరాలకు రూ.2 కోట్లకు పైగా ఖర్చు చేయడం అప్పట్లో తీవ్ర విమర్శలకు తావిచ్చింది.

రైతులకు పైసా ఇవ్వకుండా..

బీటీపీ ఎత్తిపోతల పథకానికి మొదటి ప్యాకేజీ కింద అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలో రూ.358.20 కోట్లు కేటాయించారు. ఆ పనుల టెండర్‌ను ప్రస్తుత కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబుకు చెందిన ఎస్‌ఆర్ కన్‌స్ట్రక్షన్స్ దక్కించుకుంది. జీడిపల్లి నుంచి కామన్‌కెనాల్ ద్వారా గరుడాపురం చేరే నీటిని కళ్యాణదుర్గం నియోజకవర్గం కుందుర్పి- జంబుగుంపుల వరకు మళ్లించి 114 చెరువులు నింపేలా బ్రాంచ్ కెనాల్, బీటీ ప్రాజెక్టుకు మరో బ్రాంచ్ కెనాల్ తవ్వేందుకు 1,406.89 ఎకరాల భూసేకరణ చేపట్టారు.అయితే, భూసేకరణకు సంబంధించి రైతులకు పంపిణీ చేసేందుకు తొలి విడతగా రూ.20 కోట్లు అవసరమని అధికారులు ప్రతిపాదనలు పంపితే.. అప్పట్లో చంద్రబాబు ప్రభుత్వం పైసా కూడా జమచేయలేదు. దీంతో పనులను అన్నదాతలు ఎక్కడికక్కడ అడ్డుకోవడంతో పనులు మరుగున పడిపోయాయి.

సంతోషం పంచిన జగన్

బీటీపీ ఎత్తిపోతల పథకంలో ప్రధాన ఘట్టం భూములిచ్చిన రైతులకు పరిహారం పంపిణీ. గత ప్రభుత్వ హయాంలో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ.202 కోట్ల నిధులు విడుదల చేశారు. దశల వారీగా రైతుల ఖాతాల్లో నగదు జమచేసి సంతోషం పంచారు. ఈ ప్రక్రియతో పాటు అనేక లోటుపాట్లు సరిదిద్ది పనులు పట్టాలెక్కిస్తున్న తరుణంలోనే కూటమి ప్రభుత్వం రావడంతో ప్రక్రియ మొత్తానికి బ్రేక్ పడింది.

నేడు మళ్లీ హడావుడి..

అధికారంలోకి రాగానే బీటీపీ పనులు పూర్తి చేస్తామని గత ఎన్నికల్లోనూ వాగ్దానం చేసిన చంద్రబాబు.. అధికారంలో వచ్చి ఏడాది దాటినా ఆ ఊసే ఎత్తలేదు. బడ్జెట్‌లోనూ ప్రత్యేకంగా నిధులు కేటాయించలేదు. అయితే ఇటీవల రైతుల నుంచి ఒత్తిళ్లు అధికం కావడంతో కూటమి ప్రజాప్రతినిధులు మళ్లీ హడావుడి మొదలుపెట్టడం గమనార్హం. ఇందులో భాగంగా శనివారం బ్రహ్మసముద్రం మండలం పొబ్బర్లపల్లి సమీపంలో రెండో సారి భూమి పూజలు చేయడం చర్చనీయాంశంగా మారింది. మాయలు చేయకుండా ఈ సారైనా పనులు పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.



"బీటీపీకి త్వరలో నీరిస్తాం.రైతుల సంక్షేమమే లక్ష్యం"... అప్పట్లో చంద్రబాబు భూమి పూజ చేసి ప్రారంభించిన పనులకే శనివారం మళ్లీ బ్రహ్మసముద్రం మండలం పొబ్బర్లపల్లి సమీపంలో పూజలు చేసి ప్రారంభోత్సవం చేసిన అధికార పార్టీ ప్రజాప్రతినిధులు పలికిన పలుకులివి.

రైతుల్లో నమ్మకం కోల్పోయారు



మాట చెప్పడం దాన్ని దాటవేయడం సీఎం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య. బీటీపీని 2014-19 మధ్య పూర్తి చేస్తామన్నారు. శంకుస్థాపనలతో హడావుడి చేశారు. రూ.కోట్ల ప్రజాధనం దుర్వినియోగం చేశారు. మాజీ సీఎం జగన్ 2019-24 మధ్య రైతుల్ని ఆదుకునే చర్యలు చేపట్టారు. భూసేకరణకు నిధులిచ్చారు. ప్రాజెక్టు పనులు పరుగులు పెడుతున్న సమయంలోనే మళ్లీ కూటమి ప్రభుత్వం వచ్చింది. చిత్తశుద్ధి ఉంటే పనులను సకాలంలో పూర్తి చేసి రైతులకు నీరివ్వాలి. శంకుస్థాపనలు చేసి వదిలేస్తే ఊరుకునేది లేదు. రైతులతో కలసి ఉద్యమిస్తాం.

– మెట్టు గోవిందరెడ్డి, మాజీ ఎమ్మెల్యే, రాయదుర్గం

ప్రజలు నమ్మడం లేదు



ఒకే పనికి ముఖ్యమంత్రి ఓసారి, మంత్రులు మరోసారి శంకుస్థాపనలు చేయడంపై ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. బీటీపీ ఎత్తిపోతల పథకం కొందరికి బంగారు బాతులా మారింది. రైతులకు మేలు చేకూరితే మొదటగా మేమే సంతోషిస్తాం. అలా కాకుండా శంకుస్థాపనల పేరిట రూ. లక్షల ప్రజాధనం దుర్వినియోగం చేస్తామంటే మాత్రం ఒప్పుకునేది లేదు. మా ప్రభుత్వ హయాంలో భూసేకరణకు సంబంధించి రైతులకు డబ్బులిచ్చాం. మిగిలిన ప్రక్రియను ముందుకు తీసుకెళ్తే సరిపోతుంది.

– తలారి రంగయ్య, మాజీ ఎంపీ

తీవ్రంగా తాగునీటి సమస్య

- మంత్రి కేశవ్‌తో వాపోయిన మహిళలు



డొనేకల్లులో తాగునీటి సమస్య ఉందని మంత్రికి చెబుతున్న మహిళలు

విడపనకల్లు: తమ గ్రామంలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని డొనేకల్లు గ్రామ మహిళలు మంత్రి పయ్యావుల కేశవ్‌కు విన్నవించారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని డొనేకల్లు, గడేకల్లు గ్రామాల్లో శనివారం మంత్రి పర్యటించారు. ఈ సందర్భంగా డొనేకల్లులో మహిళలు తాగునీటి సమస్యపై మంత్రి ఎదుట ఏకరువు పెట్టారు. అనంతరం కేశవ్ విలేకరులతో మాట్లాడుతూ ఏడాది కూటమి పాలనపై రాష్ట్ర ప్రజల్లో అపారమైన నమ్మకం ఏర్పడిందని తెలిపారు. వలంటీర్ల ద్వారా ప్రజలకు జరిగిందేమీ లేదన్నారు.

తల్లికి వందనం డబ్బులు ఎప్పుడొస్తాయి సారూ..?

- ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డిని ప్రశ్నించిన ప్రజలు

యాడికి: 'తల్లికి వందనం పథకం కింద మా పిల్లలకు డబ్బులు రాలేదు. సచివాలయ ఉద్యోగులను అడిగితే త్వరలో ఖాతాలో జమ అవుతుందంటున్నారు. ఇంతకూ డబ్బులు ఎప్పుడొస్తాయి'అని పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డిని ప్రశ్నించారు. శనివారం మండల కేంద్రంలోని రాఘవేంద్ర కాలనీలో 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నిర్వహించారు. ఇళ్ల వద్దకు వెళ్లి ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా అని ప్రజలను అడగగా.. 'రాలేదు'అని పలువురు ఎమ్మెల్యేకు తెలియజేశారు.

మోసపోతున్నా.. మేలుకోరా?

లుక్ యాప్ బాధితులు 20 వేల మంది పైనే

- అత్యాశే కొంప ముంచిన వైనం
- బాధితుల్లో ఉపాధ్యాయులు, ఐటీ ఉద్యోగులూ
- పోలీసులకు ఫిర్యాదు చేయడానికీ ముందుకు రాలేక ఇబ్బంది

- కురుగుంటకు చెందిన సురేష్ రూ.40 వేలు లుక్ యాప్‌లో డిపాజిట్ చేశాడు. నాలుగు రోజులు బాగానే సంపాదించాడు. ఈ క్రమంలోనే మరో 10 మందిని చేర్పించాడు. వారం రోజుల తర్వాత చూస్తే మొత్తం కంపెనీ ఎత్తేశారు. తనతో పాటు తాను కట్టించిన వారి డబ్బంతా పోయింది. దీంతో అవమానంగా భావించిన సురేష్ ఇటీవల ఇంటి నుంచి అసలు బయటకు రావడం లేదు.

- అనంతపురం నగరంలో ఓ ప్రైవేటు బ్యాంకులో పనిచేస్తున్న పరమేష్.. తన పిల్లలకు స్కూలు ఫీజులకైనా డబ్బులు సంపాదించవచ్చనే ఉద్దేశంతో 'లుక్' యాప్‌లో రూ.20 వేలు కట్టాడు. కట్టిన నాలుగు రోజులకే కంపెనీ మూసేశారు. దీంతో వారం రోజుల నుంచి బ్యాంకుకు సెలవు పెట్టి ఇంట్లోనే కూర్చున్నాడు. వీరిద్దరే కాదు.. ఉమ్మడి అనంతపురం జిల్లావ్యాప్తంగా 'లుక్' బాధితులందరిదీ ఇదే పరిస్థితి.

సాక్షి ప్రతినిధి, అనంతపురం: ఆశ ఉండొచ్చుగానీ.. అత్యాశ ఉండకూడదు అంటారు. ఈ అత్యాశే వేల మందిని ముంచేసింది. డబ్బు పోగొట్టుకునేలా చేసింది. రోజుకో యాప్.. రోజుకో సైబర్ మోసం పత్రికల్లో చూస్తూనే ఉన్నా ఎగబడి మరీ కట్టేశారు. చివరకు బిచాణా ఎత్తేస్తే గానీ వాని అసలు విషయం తెలియరాలేదు. వారం రోజుల క్రితం 'లుక్ యాప్' గొలుసుకట్టు ఫైనాన్స్ పేరుతో బురిడీ కొట్టించిన కేసులో ఉమ్మడి అనంతపురం జిల్లావ్యాప్తంగా సుమారు 20 వేల మంది రూ.30 కోట్లు పైనే పోగొట్టుకున్నట్టు పోలీసులు అంచనా వేస్తున్నారు.

ఉపాధ్యాయులు..ఐటీ ఉద్యోగులూ..

పిల్లలకు జీవిత పాఠాలు చెప్పే ఉపాధ్యాయులు సైతం 'లుక్' ఉచ్చులో ఇరుక్కోవడం విస్మయం కలిగిస్తోంది. రూ.20 వేలు కడితే రోజూ రూ.700 ఇస్తామని అనడంతో రెండు జిల్లాలో సుమారు 800 మందికి పైగా ఉపాధ్యాయులు 'యాప్'లో డబ్బులు పోశారు. ఇక ఐటీ ఉద్యోగులు వచ్చే జీతాలు సరిపోకనో లేదా అత్యాశకు వెళ్లారో గానీ వేలకు వేలు ఎగబడి కట్టారు. చివరకు మాయగాళ్లు మొత్తం ఊడ్చుకుని నిండా ముంచేశారు. అనంతపురంలోని కమలానగర్‌లో వ్యాపారులు ఒకరికి తెలియకుండా ఒకరు భారీ సంఖ్యలో డబ్బులు కట్టి మోసపోయినట్టు తెలుస్తోంది. లుక్ యాప్ ఎక్కడిదో, యజమాని ఎవరో, కార్యాలయం ఎక్కడో ఎవరికీ తెలియదు. వేలం వెర్రిగా కట్టేశారంతే!



గతంలో మోసాలు జరిగినా...

గతంలో అనంతపురం జిల్లా కేంద్రంగా భారీ స్కాములు జరిగాయి. ఈ-బిడ్ పేరుతో లక్ష రూపాయలు కడితే నెలకు రూ.30 వేలు ఇస్తామని చెప్పగా వేల మంది కట్టారు. నాలుగైదు నెలలు బాగానే ఇచ్చారు. ఆ తర్వాత బోర్డు తిప్పేశారు. రూ.230 కోట్ల మేర బాధితులకు శఠగోపం పెట్టారు. దీంతో కొంతమంది బాధితులు ఆత్మహత్యలు చేసుకున్నారు. ఆ తర్వాత జయలక్ష్మి అనే మహిళ రూ.30 కోట్ల మేరకు చిట్టీల పేరుతో కుచ్చుటోపీ పెట్టింది. తర్వాత కొద్దిరోజులకే ఆదరణ చిట్స్ పేరుతో రూ.50 కోట్లు ఎగ్గొట్టారు. ఇలా పలు ఘటనలు జరిగినా అత్యాశకు పోవడం వల్లే మోసపోతున్నట్టు తెలుస్తోంది.

కుళ్లాయిస్వామికి విశేష పూజలు



గూగూడులో పూజలందుకున్న కుళ్లాయిస్వామి పీర్లు

నార్పల: గూగూడు కుళ్లాయిస్వామి ఉత్సవాలు కనులపండువగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శనివారం స్వామి వారికి విశేష పూజలు నిర్వహించారు. స్వామి వారిని అర్చకులు హుసేనప్ప ప్రత్యేక పూలు, పట్టు వస్త్రాలు, బంగారు ఆభరణాలతో అలంకరించారు. రాష్ట్రం నలుమూలల నుంచి భక్తాదులు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. ఉత్సవాల సందర్భంగా ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు జరిగాయి. ఆదివారం పెద్ద సరిగెత్తు, సోమవారం తెల్లవారుజామున 2 గంటలకు గ్రామోత్సవం, ఉదయం 6 గంటలకు అగ్నిగుండ ప్రవేశం, సాయంత్రం గ్రామోత్సవం, జలధి కార్యక్రమం ఉంటుందని అర్చకులు తెలిపారు. ఉత్సవాల్లో అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా ఎస్‌ఐ సాగర్ గట్టి బందోబస్తు నిర్వహించారు.

గురుకుల ప్రవేశాలకు 8న రెండోవిడత కౌన్సెలింగ్

అనంతపురం ఎడ్యుకేషన్/రూరల్: ఉమ్మడి జిల్లాలోని అంబేడ్కర్ గురుకుల పాఠశాలల్లో 5వ తరగతిలో మిగులు సీట్ల ప్రవేశాలకు ఈనెల 8న అనంతపురం రూరల్ మండలం కురుగుంట గురుకుల పాఠశాలలో కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు ఉమ్మడి జిల్లా సమన్వయ అధికారి కె.జయలక్ష్మి ఓ ప్రకటనలో తెలిపారు. బీఆర్‌ఏజీసెట్-2025 మెరిట్ జాబితా ఆధారంగా విద్యార్థులను ఎంపిక చేసినట్లు వెల్లడించారు. 8న ఉదయం 10 గంటలకు కౌన్సెలింగ్ ప్రారంభమవుతుందన్నారు. తాము ఫోన్‌ద్వారా సమాచారం అందించిన విద్యార్థులు మాత్రమే హాజరుకావాలని సూచించారు.



ప్రత్యేక అలంకరణలో ఉత్సవమూర్తులు



రథోత్సవంలో మహిళల కోలాటం



కళాకారుల కోలాహలం

రమణీయం.. పూరీ జగన్నాథుడి రథోత్సవం

అనంతపురం కల్చరల్: ఆధ్యాత్మికత వెల్లివిరిసింది. హరే రామ హరే కృష్ణ నామస్మరణతో పురవీధులు మార్మోగాయి. పూరీ జగన్నాథుడి రథయాత్రను పురస్కరించుకుని అనంతపురం భక్తిసాగరంలో మునిగితేలింది. ఇస్కాన్ మందిరం ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన రథోత్సవంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. పవిత్ర నదీజలాలతో సంప్రోక్షణ అనంతరం స్థానిక కేఎస్‌ఆర్ కళాశాల వద్ద రథోత్సవాన్ని సత్యగోపీనాథ్ ప్రభు జెండా ఊపి ప్రారంభించారు. సప్తగిరి సర్కిల్ నుంచి పాతూరు, శ్రీకంఠం సర్కిల్,ఆర్ట్స్ కళాశాల, టవర్ క్లాక్ మీదుగా వెళ్లి లలితకళాపరిషత్తు వరకు రథయాత్ర సాగింది. ఈ సందర్భంగా రథం ముందు కళాకారులు సందడి చేశారు. చెక్కభజన, దేవతామూర్తుల వేషధారులు, కోలాటం, గురవయ్యలు, ఉరుముల కళాకారులు అద్భుతంగా కళారూపాలను ప్రదర్శించారు. నాట్యాచార్యులు దేవరకొండ కౌసల్య ఆధ్వర్యంలో కళాకారులు శాస్త్రీయ నృత్యాలతో జగన్నాథుడికి భక్తి నీరాజనాలర్పించారు. ఇస్కాన్ విశిష్టతను తెలియజేశారు.

- అంతకుముందు లలితకళాపరిషత్తులో ఇస్కాన్ మందిర ఇన్‌చార్జ్ దామోదర గౌరంగదాసు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఆత్మీయ అతిథులుగా విచ్చేసిన సినీనటుడు సుమన్, సత్య గోపీనాథ్ మాట్లాడుతూ ఇస్కాన్ సేవలు అమూల్యమన్నారు. రథయాత్రలో కుల మతాలకతీతంగా ప్రజలు పాల్గొనడం సంతోషం కలిగిస్తోందన్నారు. కార్యక్రమంలో పర్చూరు నారాయణ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



అనంతపురంలో పూరీ జగన్నాథ రథోత్సవంలో పెద్ద సంఖ్యలో పాల్గొన్న భక్తులు

క్లుప్తంగా

అంధురాలిని అనాథగా వదిలేసి..



సంజమ్మకు అల్పాహారం తినిపిస్తున్న ఆది

పెద్దపప్పూరు: అంధురాలు.. ఆపై నడవలేని స్థితిలో ఉనన ఓ మహిళ పెద్దపప్పూరు మండలంలోని అశ్వత్థనారాయణ స్వామి క్షేత్రంలో అనాథలా ఉండిపోయింది. పుట్లూరు మండలం కందికాపుల గ్రామానికి చెందిన సంజమ్మను ఎవరో పది రోజుల క్రితం ఇక్కడ వదిలేసి వెళ్లిపోయారు. అప్పటి నుంచి ఆరుబయట దోమల బెడదతో పాటు ఈదురుగాలులకు వణుకుతూ కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతోంది. నిత్యం స్వామి దర్శనానికి వచ్చే పాముల ఆది అనే భక్తుడు అమెను చూసి చలించిపోయి సపర్యలు చేస్తున్నారు. ఆమెకు స్నానం చేయించి.. అన్నపానీయాలు అందిస్తున్నారు. అలాగే వదిలేస్తే ఆమె ఆరోగ్యం క్షీణించే అవకాశం ఉండటంతో అటు వైపు వెళ్లిన 'సాక్షి' సదరు మహిళ సమీప బంధువుల ఫోన్ నంబర్ సేకరించి పరిస్థితి వివరించింది. సంజమ్మ యల్లనూరులో ఉందనుకున్నామని, వెంటనే ఈ విషయం కుటుంబ సభ్యులకు తెలిపి అశ్వత్థం నుంచి తీసుకెళ్లాలని తెలియజేస్తామని సమాధానమిచ్చారు.

బొలెరో..బైక్ ఢీ: ఇద్దరు మృతి





మృతి చెందిన ఓబిలేసు, సదాశివ

బత్తలపల్లి: వేల్పుమడుగు క్రాస్ వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. బత్తలపల్లి ఎస్ఐ సోమశేఖర్ తెలిపిన వివరాలు మేరకు.. మండలంలోని గంటాపురం గ్రామానికి చెందిన ఓబిలేసు(38) శనివారం ఉదయం తన బైక్‌పై బత్తలపల్లి నుంచి స్వగ్రామానికి బయలుదేరాడు. ఇదే సమయంలో పీర్లను దర్శించుకునేందుకు గంటాపురం వెళ్లేందుకు రోడ్డుపై ఉన్న సదాశివ(32)ను తన బైక్‌పై ఎక్కించుకున్నాడు. వీరి వాహనం బత్తలపల్లి బైపాస్ వద్ద వేల్పుమడుగు రోడ్డు క్రాస్ చేస్తున్న సమయంలో అనంతపురం నుంచి తమిళనాడుకు జీవాలతో వెళ్తున్న బొలెరో వాహనం వేగంగా వచ్చి ఢీకొంది. ఈ ప్రమాదంలో బైక్‌పై వెళ్తున్న వారిరువురూ అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న బత్తలపల్లి ఎస్ఐ సోమశేఖర్, ఏఎస్ఐ సోమశేఖర్‌మూర్తి సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను హైవే అంబులెన్స్‌లో ఆర్డీటీ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న గంటాపురం గ్రామస్తులు, మృతుల బంధువులు సంఘటనాస్థలానికి పెద్ద ఎత్తున తరలివచ్చారు. నిర్జీవంగా ఉన్న తమ వారిని చూసి వారంతా కన్నీరు మున్నీరయ్యారు.

దేవరకొండకు తూట్లు

- టీడీపీ నేతల నిర్వాకం
- సమీప పంట పొలాలకు దెబ్బ
- చుట్టుపక్కల 4 గ్రామాల వరకు ఎఫెక్ట్..
- క్వారీ నిర్వహించరాదంటున్న రైతులు

అది ఒక కొండ కాదు. చుట్టుపక్కల గ్రామాల ప్రజలు కొలిచే దేవతా స్వరూపం. కరువు నుంచి రక్షించే 'దొణ తిమ్మరాయస్వామి దేవరకొండ'. తరతరాలుగా పూజలందుకుంటున్న ఈ కొండను ప్రజలు 'ద్యావుర బండ' అని పిలుచుకొని కొలుచుకుంటారు. అలాంటి ప్రజల విశ్వాసంపై అధికార తెలుగుదేశం పార్టీ నాయకులు తూటాలు (బండను పేల్చే పేలుడు పదార్థాలు) పేలుస్తుండటం ఆయా గ్రామాల ప్రజలకు నిద్రపట్టకుండా చేస్తోంది.

కొండపై 'దొణ'లే జీవనాధారం...



కొండపై ఎప్పటికీ ఎండిపోని 'దొణ'

తిమ్మప్పకొండపై ఉన్న లోతైన దొణలు ఎప్పటికీ ఎండిపోవని, స్వచ్ఛమైన నీరు అప్పుడు, ఇప్పుడు ప్రజలకు జీవనాధారంగా ఉందని ప్రజలు తెలిపారు. కొండ ఇంతటి నీటిని పట్టి ఉంచటం వల్లే మా గ్రామాల్లో భూగర్భజలాలు ఎక్కువగా ఉన్నాయని, వన్య ప్రాణులు అధిక సంఖ్యలో ఉన్నాయని చెబుతున్నారు. పొలాల్లో ఉన్న రైతులకు ఈ 'దొణ'ల్లోని నీరే దాహం తీర్చుతుందన్నారు. ప్రస్తుతం కూడా ఈ కొండపై పెద్ద నీటి ట్యాంకు నిర్మించారని, ఈ ట్యాంక్ నుంచే గ్రామాలకు తాగునీరు సరఫరా అవుతోందని తెలిపారు. ఇలాంటి కొండపై పేలుళ్లు జరిపి కంకర తీసుకొని కొండను నేలమట్టం చేయాలనే ఆలోచనను టీడీపీ నాయకులు విరమించుకోవాలని వేడుకుంటున్నారు.



దేవరకొండలో క్వారీ నిర్వహణకు ఏర్పాట్లు చేసుకున్న దృశ్యం

శెట్టూరు: మండలంలోని ఐదుకల్లు, యాటకల్లు, మంగంపల్లి, ఉప్పొంక గ్రామాల మధ్య సర్వే నంబర్ 185లో సువిశాలమైన విస్తీర్ణంలో కొండ (ద్యావుర బండ) ఉంది. కొండపై తిమ్మరాయప్ప పాదం, స్వామివారి గుర్రం పాదం గుర్తులు ఉన్నాయి. వీటికి రైతులు ఉత్తరకార్తెలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. కూటమి ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత టీడీపీ నాయకులకు ఈ కొండపై కన్ను పడింది. కొండను తవ్వి కంకర అమ్ముకుని సొమ్ము చేసుకోవాలనుకున్నారు. ఇందు కోసం క్వారీ నిర్వహణకు అనుమతుల కోసం పావులు కదిపారు. కొండకు ఆనుకుని ఉన్న ఇద్దరు రైతుల డీ-పట్టా పొలాలను లీజుకు తీసుకుని.. అందులో క్రషర్ యంత్ర సామగ్రిని సమకూర్చారు. కొండకు చుట్టుపక్కలన్నీ సాగు భూములే. 70కి పైగా మామిడి తోటలు, 300కు పైగా బోరు బావులు ఉన్నాయి. క్వారీ నిర్వహణ విషయం రైతులకు ఏమాత్రం తెలియదు. అధికారులు కూడా ఎటువంటి ప్రకటనా చేయలేదు. అయినా సరే అధికార పార్టీ నాయకులు బండకు తూట్లు పొడుస్తున్నారు. బండను పేల్చే సమయంలో పొలాల్లోకి రాళ్లు ఎగిరి పడటం.. క్రషింగ్ చేసేటపుడు దుమ్ము, ధూళి పంటలను కప్పేయడంతో దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపుతోందని రైతులు వాపోతున్నారు.

కొండకాదు మా దేవత....

దేవర కొండను తాము కొండగా చూడబోమని, దేవతగా ఆరాధిస్తామని ప్రజలు తెలిపారు. పురాతన కాలం నుంచి కొండపై వెలసిన దొణ తిమ్మప్పను పూజిస్తున్నట్లు చెప్పారు. ఐదుకల్లు, యాటకల్లు, మంగంపల్లి, ఉప్పొంక గ్రామాల రైతులను రక్షించే దైవం, ఇక్కడ వర్షాలు లేక కరువు వస్తే ఈ కొండపైకి వచ్చి తిమ్మప్పస్వామికి పూజలు చేసి, వంట వండి నైవేద్యం సమర్పిస్తే.. తిరిగి ఇంటికి వెళ్లేలోపే వర్షం పడేదని చెబుతున్నారు. కొండపై పూరాతన మాగాణి (పంటలు పండే భూమి) ఉండేదని, పూర్వానికి ఏడు గ్రామాల ప్రజలు ఇక్కడ నివసించి ఆహార ధాన్యాలు పండించే వారని గుర్తు చేస్తున్నారు.

మామిడితోటే నా జీవనాధారం

దేవరబండ అనే కొండకు ఆనుకుని నాకు ఏడు ఎకరాల పొలం ఉంది. ఐదేళ్ల క్రితం తోటలో మామిడి మొక్కలు నాటాను. ప్రస్తుతం కాపు కాస్తున్నాయి. అయితే ఇక్కడి కొండపై పేలుడు పదార్థాలు పెట్టి బండను పేలుస్తున్నారు. దీనివల్ల దుమ్ము, ధూళి వచ్చి మామిడి చెట్లపై పడుతోంది. దీనివల్ల కాపు రాకుండా పోతోంది. ఇక్కడ కంకర మిషన్ నిర్వహిస్తే నా తోటపై ఆశలు పూర్తిగా వదులుకోవాల్సిందే. ఈ కొండను తవ్వేందుకు అధికారులు అనుమతులు ఇవ్వరాదు.

– రామాంజనేయులు, రైతు, ఐదుకల్లు

పరిశీలించి.. చర్యలు తీసుకుంటాం

నేను ఐదురోజుల క్రితం తహసీల్దార్‌గా బాధ్యతలు తీసుకున్నా. క్వారీ నిర్వహణ, అనుమతులు విషయం ఏవీ తెలియదు. నా దృష్టికి వస్తే పరిశీలించి.. ప్రజల ఇబ్బందులను పరిగణనలోకి తీసుకుని సమస్యను పరిష్కరించడానికి కృషి చేస్తా.

– ఈశ్వరమ్మ, తహసీల్దార్, శెట్టూరు

క్వారీ వద్దంటూ కొండపై ఆందోళన



దేవరకొండపై క్వారీ ఏర్పాటు తగదని రైతులు శనివారం ఆందోళన చేపట్టారు. క్వారీ నిర్వహిస్తే పంటలు పండకుండా పోతాయని, బోరుబావుల్లో భూగర్భజలాలు ఇంకిపోతాయని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల ఆందోళనకు సర్పంచ్ విరూపాక్షి గౌడ్, సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు ఎర్రిస్వామి, మహిళా నాయకురాలు మంజులమ్మ, దళిత నాయకురాలు నాగమ్మ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా రైతులు, ప్రజలు కొండపై దొణతిమ్మరాయస్వామికి పూజలు నిర్వహించి, కొండను, కొండపై ఆధారపడ్డ గ్రామాలను రక్షించాలని వేడుకున్నారు.

లింగ నిర్ధారణపై కఠినంగా వ్యవహరించాలి



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్

అనంతపురం అర్బన్: 'గర్భస్థ పిండ లింగ నిర్ధారణపై కఠినంగా వ్యవహరించాలి. స్కానింగ్ సెంటర్లను విస్తృతంగా తనిఖీ చేయాలి. ఎవరైనా నిబంధనలను ఉల్లంఘిస్తున్నట్లు గుర్తిస్తే కేసులు నమోదు చేయండి' అని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టర్ శనివారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో పీసీపీఎన్‌డీటీ యాక్ట్ (గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిషేధిత చట్టం) అమలుపై జిల్లాస్థాయి మల్టీ మెంబర్ అప్రాప్రియేట్ అథారిటీ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భస్థ పిండ లింగ నిర్ధారణ తీవ్ర నేరమన్నారు. ఇలాంటి చర్యలకు పాల్పడే వారి విషయంలో చాలా కఠినంగా ఉండాలని చెప్పారు. సమావేశంలో డీఎంహెచ్ఓ ఈబీదేవి, ఆర్డీటీ సంస్థ ప్రతినిధి డాక్టర్ దుర్గేష్, సీఐ బాషా, డెమో త్యాగరాజ్ పాల్గొన్నారు.

మొక్కజొన్న వ్యాపారిపై కేసు

యాడికి: రైతుల నుంచి మొక్కజొన్న పంటను కొనుగోలు చేసి డబ్బులు ఇవ్వకుండా మోసం చేసిన వ్యాపారిపై యాడికి పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలిలా ఉన్నాయి. హైదరాబాద్‌కు చెందిన ఎ.సంతోష్‌కుమార్ అనే వ్యక్తి శ్రీ చంద్రాల పరమేశ్వర ట్రేడర్స్ ఆల్ పౌల్ట్రీ ఇంగ్రీడియన్స్ అండ్ రా మెటీరియల్స్ సంస్థ ఉంది. గత ఏడాది ఈ వివరాలతో కూడిన విజిటింగ్ కార్డును యాడికి మండలం తూట్రాళ్లపల్లికి చెందిన పెద్దయ్య కుమారుడు నూతల సాయి కల్యాణ్‌కు పంపాడు. దీంతో సాయి కల్యాణ్ రూ.1,28,14,340 విలువ గల మొక్కజొన్న పంటను హైదరాబాద్‌లోని సంతోష్ కుమార్‌కు విక్రయించాడు. ఇందులో రూ.68,26,080 మాత్రమే ఇచ్చి.. మిగతా సొమ్ము ఇవ్వకుండా మోసం చేశాడు. ఎన్నిసార్లు ఫోన్ చేసినా స్పందన లేకపోవడంతో సాయి కల్యాణ్ ఫిర్యాదు మేరకు సంతోష్‌కుమార్‌పై కేసు నమోదు చేసినట్లు పోలీసులు శనివారం తెలిపారు.

పీఆర్సీని వెంటనే ప్రకటించాలి

అనంతపురం ఎడ్యుకేషన్: కూటమి ప్రభుత్వం ఏర్పడి 13 నెలలైనా ఉద్యోగ, ఉపాధ్యాయుల పీఆర్సీ గురించి ఏమాత్రం పట్టించుకోలేదని వైఎస్సార్ టీచర్స్ అసోసియేషన్ నాయకులు మండిపడ్డారు. ఈ మేరకు అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు నాగిరెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రీధర్ గౌడ్, నాయకులు గోవిందరెడ్డి, రాధాకృష్ణరెడ్డి, వెంకటరమణప్ప, గోపాల్, వెంకటరెడ్డి, రామకృష్ణ శనివారం ఓ సంయుక్త ప్రకటన విడుదల చేశారు. ఉన్న పీఆర్సీ కమిటీ ఏడాది కిందట రద్దయిందని పేర్కొన్నారు. మళ్లీ పీఆర్సీ కమిటీ వేయకుండా, కనీసం ఐఆర్, డీఏ కూడా ప్రకటించకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తోందని విమర్శించారు.

ఎంసెట్‌లో మంచి ర్యాంకు రాలేదని ఆత్మహత్య



సాగర్‌కుమార్‌రెడ్డి(ఫైల్)

తాడిపత్రి రూరల్: ఎంసెట్‌లో ఆశించిన స్థాయిలో ర్యాంకు రాలేదని మనస్తాపం చెందిన విద్యార్థి సాగర్‌కుమార్‌రెడ్డి (17) రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఇందుకు సంబంధించిన వివరాలను జీఆర్‌పీఎఫ్ ఎస్ఐ నాగప్ప శనివారం మీడియాకు వెల్లడించారు. యల్లనూరు మండలం అచ్యుతాపురం గ్రామానికి చెందిన వ్యవసాయదారుడైన పద్మభూషణ్‌రెడ్డి కుమారుడు సాగర్‌కుమార్‌రెడ్డి అనంతపురంలోని ఒక ప్రైవేట్ కళాశాలలో ఇంటర్మీడియెట్ చదివాడు. ఇంటర్ తెరువాత ఎంసెట్‌లో మంచి ర్యాంకు రాకపోవడంతో లాంగ్‌టర్మ్ కోచింగ్‌కు వెళ్లాడు. రెండోసారి రాసిన ఎంసెట్‌లోకూడా మంచి ర్యాంకు రాకపోవడంతో జీవితంపై విరక్తి చెంది శనివారం ఇంట్లోవారికి చెప్పకుండా తాడిపత్రికి మోటార్‌సైకిల్‌పై వచ్చాడు. చల్లవారిపల్లివద్ద మోటార్‌సైకిల్‌ను పార్క్ చేశానని, వచ్చి తీసుకెళ్లాలని ఇంట్లోవారికి సెల్‌ఫోన్‌లో మెసేజ్ పంపాడు. అనంతరం సాగర్‌కుమార్‌రెడ్డి రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి వివరాల కోసం ఆరా తీశారు. ఎలాంటి అచూకీ తెలియకపోవడంతో ఫొటోలను తీశామన్నారు. రైలు కింద పడిన యువకుడు తన కుమారుడని పద్మభూషణ్‌రెడ్డి సమాచారం ఇవ్వడంతో ఫిర్యాదు తీసుకున్నామని ఎస్ఐ తెలిపారు.

అనధికారికంగా లే అవుట్ వేస్తే క్రిమినల్ కేసు

అనంతపురం అర్బన్: అనుమతులు లేకుండా లే అవుట్లు వేస్తూ ప్రజలను మభ్యపెట్టడంతో పాటు ప్రభుత్వ ఆదాయానికి కొందరు గండికొడుతున్న రియల్టర్లు, భూ యజమానులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని జాయింట్ కలెక్టర్, అహుడా వైస్ చైర్మన్ శివ్ నారాయణ్ శర్మ ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో అహుడా కార్యదర్శి జి.రామకృష్ణారెడ్డి, ప్లానింగ్ అధికారి కేఎండీ ఇషాక్‌తో కలిసి అనంతపురం రూరల్, బుక్కరాసముద్రం పంచాయతీ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీల్లో భవన నిర్మాణ అనుమతుల ప్రక్రియ పారదర్శకంగా ఉండాలన్నారు. ఆన్‌లైన్ వ్యవస్థ ఉన్నప్పటికీ కొందరు ఆఫ్‌లైన్ ద్వారా అనుమతులు జారీ చేస్తున్నారని, ఆ అనుమతులు చట్టరీత్యా చెల్లవని స్పష్టం చేశారు. ఐఆర్ఎస్ 2020 స్కీమ్‌లో అప్రూవ్ అయిన ఐపీఎల్‌పీ లే అవుట్లలోని ప్లాట్లలో భవన నిర్మాణ అనుమతులు పొందడం ఇబ్బందిగా ఉందని, ఈ సమస్యను త్వరగా పరిష్కరించాలని జేసీని కొందరు కార్యదర్శులు కోరారు. ఎల్ఆర్ఎస్ 2020 స్కీమ్‌లో క్రమబద్ధీకరణకు ఆస్కారం ఉన్నప్పటికీ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోని లే అవుట్లలోని ప్లాట్లలో భవన నిర్మాణ అనుమతులకు పరిష్కారం చూపాలని కోరారు. జేసీ స్పందిస్తూ కాంపౌండింగ్ చార్జీలు విధించి అనుమతుల జారీకి త్వరలో చర్యలు చేపడతామని చెప్పారు. సమావేశంలో అహుడా ప్లానింగ్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, ఈఓపీఆర్‌డీలు, డీఎల్‌పీఓలు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కమిటీలో పలువురికి చోటు



వెన్నం శివరామిరెడ్డి



చింతకుంట వెంకటేశులు




గంగన గోపాల్‌రెడ్డి




మెట్టు విశ్వనాథ్‌రెడ్డి



కశేకుర్తి ఉషారాణి



చుక్కలూరు దిలీప్‌రెడ్డి



జింకల రామాంజినేయులు

అనంతపురం కార్పొరేషన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్ర కమిటీలో జిల్లాకు చెందిన పలువురు నాయకులకు చోటు లభించింది. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శులుగా వెన్నం శివరామిరెడ్డి (ఎస్ఆర్ఐ), చింతకుంట వెంకటేశులు (అనంతపురం అర్బన్), మెట్టు విశ్వనాథ్‌రెడ్డి, కశేకుర్తి ఉషారాణి (రాయదుర్గం), జింకల రామాంజినేయులు, చుక్కలూరు దిలీప్‌రెడ్డి(గుంతకల్లు), బళ్లారి మహమ్మద్ జిలాన్, వెన్నపూస వెంకటరామిరెడ్డి (తాడిపత్రి), కురుబ నాగిరెడ్డి, గంగన గోపాల్‌రెడ్డి, ముదిగుబ్బ వీరాంజినేయులు, అంకె లక్ష్మణ్ణ(రాప్తాడు) నియమితులయ్యారు.

ట్రేడ్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా 'కొర్రపాడు'





కొర్రపాడు హుస్సేన్ పీరా, రాజశేఖర్‌రెడ్డి

అనంతపురం కార్పొరేషన్: వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర కమిటీలో జిల్లాకు చెందిన ఇద్దరికి అవకాశం కల్పించారు. ట్రేడ్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా అనంతపురానికి చెందిన కొర్రపాడు హుస్సేన్‌పీరా, రాష్ట్ర కార్యదర్శిగా బి.రాజశేఖర్‌రెడ్డి (రాజారెడ్డి)ని నియమించారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులు అందాయి.

'విద్యా శక్తి'ని టీచర్లపై రుద్దడం సరికాదు



మాట్లాడుతున్న స్కూల్ అసిస్టెంట్ అసోసియేషన్ నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: బడి వేళల తర్వాత 'విద్యాశక్తి' అనే నూతన కార్యక్రమాన్ని ప్రభుత్వం ఉపాధ్యాయులపై రుద్దడం సరికాదని స్కూల్ అసిస్టెంట్ అసోసియేషన్ నాయకులు వాపోయారు. శనివారం సాయంత్రం నగరంలోని ఉపాధ్యాయ భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి బి. రాజశేఖర్ మాట్లాడారు. ఏటా 10వ తరగతి విద్యార్థులకు 'వంద రోజుల ప్రణాళిక' కార్యక్రమం జనవరి నెలలో ప్రారంభమవుతుందన్నారు. కానీ జూలై 1 నుంచే పారంభించడం ఉపాధ్యాయులపై ఒత్తిడి తీసుకురావడమేనని ఆందోళన వ్యక్తం చేశారు. ఇది పూర్తిగా అశాస్త్రీయమైన విధానమని అన్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులకు తీవ్రమైన ఇబ్బందులు ఏర్పడతాయన్నారు. రవాణా సౌకర్యం లేని గ్రామాలు చాలా ఉన్నాయన్నారు. కాలి బాటన వచ్చే గ్రామీణ ప్రాంత విద్యార్థులు అధికంగా ఉన్నారని, వారు ఇంటికి చేరుకోవడానికి చీకటి అవుతుందన్నారు. ముఖ్యంగా బాలికలకు తీవ్ర అసౌకర్యంగా ఉంటుందన్నారు. ప్రభుత్వం నిర్ణయం ఏమాత్రమూ ఆమోదయోగ్యంగా లేదన్నారు. మరోవైపు రెగ్యులర్ బోధనకు ఆటంకం ఏర్పడుతుందని పేర్కొన్నారు. అనాలోచిత నిర్ణయం వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో స్కూల్ అసిస్టెంట్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శివశంకరయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి లింగమూర్తి, నాయకులు నాగన్న, ఓబులేసు, శ్రీరాములు పాల్గొన్నారు.

కలుషిత నీరు కలకలం

- గుంతకల్లులో వాంతులు, విరేచనాలతో ఆస్పత్రికి బాధితుల పరుగులు



గుంతకల్లు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు

గుంతకల్లు: కలుషిత నీరు కలకలం సృష్టించాయి. వాంతులు, కడుపునొప్పితో బాధితులు ఆస్పత్రికి పరుగులు తీశారు. వివరాలు.. శనివారం ఉదయం గుంతకల్లు పట్టణంలోని పలు చోట్ల మున్సిపల్ కుళాయిలకు నీళ్లు వదిలారు. ఈ క్రమంలోనే స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద సాయిక్రిష్ణ ఆస్పత్రి సమీపంలో నివాసముంటున్న వారు కుళాయి నీళ్లను పట్టుకుని తాగారు. కొంతసేపటికే వాంతులు, విరేచనలు, కడుపు నొప్పి మొదలవడంతో వనజ, స్వాతి, గీతమ్మ, దీపక, భరత్, కళ్యాణీ, చిట్టక్క, బ్రహ్మ, భీమలింగా, రామ్ లక్ష్మణ్, కార్తీక్, ఉదయ్‌తోపాటు మరో 10 మంది లబోదిబోమంటూ స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి పరుగులు పెట్టారు. వైద్యులు పరీక్షలు నిర్వహించి ఆరుగురిని అడ్మిట్ చేసుకున్నారు. మిగిలిన వారికి ప్రాథమిక చికిత్సలు అందించి ఇంటికి పంపారు. కుళాయి నీళ్లు ఎర్రగా ఉండటంతో పాటు వాసన వెదజల్లాయని రోగులు తెలిపారు. పురుగులు కూడా కనిపించాయన్నారు. తమ ప్రాంతంలో మురికి కాలవలు శుభ్రం చేయకపోవడంతో చెత్త చెదారం పేరుకు పోయిందన్నారు. మున్సిపల్ అధికారులు తగిన చర్యలు తీసుకోకపోవడంతో కుళాయిల్లో కలుషిత నీరు వస్తున్నాయని వాపోయాచారు.

- రోగులను వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జ్ మార్కెట్ వెంకటేష్ పరామర్శించారు. విషయాన్ని వైద్యారోగ్య శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ క్రమంలో తిలక్‌నగర్ అర్బన్ హెల్త్ సెంటర్ డాక్టర్ స్వాతి, ఏఎస్ఎం శ్రీలత, ఆశా వర్కర్ జానికి వెంటనే ఆ ప్రాంతంలో పర్యటించారు. అందరికీ ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. నీళ్లను బాగా వేడి చేసి చల్లార్చిన తరువాత తాగాలని డాక్టర్ స్వాతి సూచించారు.

'మెగా పీటీఎం' నిర్వహణలో వివాదాస్పద నిర్ణయం

అనంతపురం ఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠశాలల్లో ఈ నెల 10న జరగనున్న మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశా (మెగా పీటీఎం)ల నిర్వహణపై ప్రభుత్వం వివాదాస్పద నిర్ణయం తీసుకుంది. గతంలో పేరెంట్స్ టీచర్స్ సమావేశాలు పండుగ వాతావరణంలో జరిగాయి. ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు తరలివచ్చి సందడిసందడిగా చేసేవారు. ఆయా పాఠశాలల హెచ్ఎంలే ఫొటోలు, వీడియోలు తీసి తమ పైఅధికారులకు నివేదించేవారు. ఈసారి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై ఉపాధ్యాయ సంఘాల నాయకులు మండిపడుతున్నారు. స్కూల్ హెచ్ఎంలు ఇతర శాఖల అధికారులు, ఉద్యోగుల వద్దకు వెళ్లి వారిని ఒప్పించుకుని పరిశీలన అధికారులుగా నియమించుకోవాలి. ఆరోజు వారు వచ్చి వారి మొబైల్‌లో ఫొటోలు, వీడియోలు తీసి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలంటూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ కార్యక్రమ నిర్వహణకు అప్‌లోడ్ చేసిన అధికారులు, ఉద్యోగులే విట్నెస్ (సాక్షి)గా ఉండాలని స్పష్టం చేశారు. ఈ నిర్ణయం ముమ్మాటికీ తమను అవమానించడమేనని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు వాపోతున్నారు.

ఉత్తర్వులు రద్దు చేయాలి

ఉపాధ్యాయులు, తల్లిదండ్రులతో పాఠశాలలో జరిగే మెగా పీటీఎంలో విట్నెస్ అధికారిని ప్రధానోపాధ్యాయులే నియమించుకుని వారితో వీడియోలు తీయించి అప్‌లోడ్ చేయాలనే ప్రభుత్వ ఉత్తర్వులను రద్దు చేయాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గోవిందరాజులు, లింగమయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం డీఈఓ కార్యాలయ ఏడీ శ్రీనివాసరావును కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు కలసి విద్యార్థుల విద్యాభివృద్ధి, పాఠశాలల్లో ఉన్న మౌలిక సదుపాయాలపై మాట్లాడుకోవడానికి 17 రకాల కమిటీలు, ఫొటోల అప్‌లోడ్, విట్నెస్ అధికారులు ఇంత తతంగం అవసరమా? అని ప్రశ్నించారు. పీటీఎం కార్యక్రమాన్ని డాక్యుమెంట్ కార్యక్రమంగా మార్చొద్దన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి సుబ్బరాయుడు, ఆడిట్ కమిటీ కన్వీనర్ చంద్రమోహన్, సీనియర్ నాయకులు నాగేంద్ర, కోటేశ్వరప్ప, మోడల్ స్కూల్ శివానంద, నాయకులు ఓబుళపతి, మహమ్మద్ గౌస్, రమేష్, హనుమేష్, మహేంద్ర, సురేంద్ర, స్వాతి మురళీధర్ పాల్గొన్నారు.

హెచ్ఎంలు, టీచర్లను అవమానించడమే

మెగా పేరెంట్స్, టీచర్స్ మీటింగ్‌కు సాక్షులుగా ఇతర ఉద్యోగులను నియమించడం అంటే హెచ్ఎంలు, ఉపాధ్యాయులను అవమానించడమేనని గిరిజన ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గుజ్జల శివయ్య, డెగావత్ రవీంద్రనాథ్ మండిపడ్డారు. బాహ్య పరిశీలకుల పేరిట ఇతర శాఖల వారిని విట్నెస్‌కు గాను వీడియో రూపంలో అప్‌లోడ్ చేయాలని చెప్పడం బాధాకరమన్నారు. ఈ నిర్ణయాన్ని ప్రభుత్వం వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

క్లుప్తంగా

నేడు విద్యుత్ అంతరాయం

అనంతపురం టౌన్: నగరంలోని అరవింద్ నగర్, రాంనగర్, కమలా నగర్, సప్తగిరి సర్కిల్, రహమత్ నగర్, రామచంద్ర నగర్, ఆదిమూర్తి నగర్ తదితర ప్రాంతాల్లో ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని విద్యుత్‌శాఖ ఏడీఈఈ చంద్రశేఖర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని ఆయా ప్రాంతాల ప్రజలు గమనించాలని కోరారు.

నేడు త్యాగరాజ సంగీత సభ వార్షికోత్సవం

అనంతపురం కల్చరల్: అనంత కళావైభవాన్ని చాటుతూ గత ఆరున్నర దశాబ్దాలకు పైగా విశేష సేవలందించిన శ్రీ త్యాగరాజ సంగీత సభ 67వ వార్షికోత్సవ సభ ఆదివారం నిర్వహిస్తున్నట్లు సభ అధ్యక్షుడు బుగ్గయ్య చౌదరి, వ్యవస్థాపకుడు జ్ఞానేశ్వరరావు ఉత్తార్కర్ తెలిపారు. ఉదయం 10 గంటలకు సంగీత దిగ్గజం బాలమురళీకృష్ణ, నాట్య పితామహుడు మైసూరు వరదరాజ అయ్యంగార్ జయంతిని పురస్కరించుకుని సంగీత నృత్య విభావరి ఉంటుందని పేర్కొన్నారు. కళాభిమానులు పెద్ద ఎత్తున విచ్చేయాలని కోరారు.

చెట్లే జగతికి మూలాధారం


మొక్క నాటుతున్న శ్రీచైతన్య పాఠశాలల ఏజీఎం సుబ్బారెడ్డి

అనంతపురం ఎడ్యుకేషన్: స్థానిక హౌసింగ్ బోర్డ్ కాలనీలోని శ్రీచైతన్య బాలికల రెసిడెన్షియల్ స్కూల్ ఆవరణలో శనివారం 'క్లీన్ ఇండియా గ్రీన్ ఇండియా' కార్యక్రమం నిర్వహించారు. పాఠశాలల ఏజీఎం సుబ్బారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. చెట్లే జగతికి మూలాధారం అన్నారు. చెట్లే మన మనుగడకు ఆధారం అని.. చెట్లు లేనిదే బతుకు లేదన్నారు. వాతావరణం సమతుల్యంగా ఉండటానికి ప్రతి ఒక్కరూ తప్పక మొక్కలు నాటాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో కలసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సమీనా ఖాన్, కో–ఆర్డినేటర్ రాధాకృష్ణ, డీన్ సత్యనారాయణ, సీబ్యాచ్ ఇన్‌చార్జ్ చంద్రమోహన్ పాల్గొన్నారు.

పర్యవేక్షణ పక్కాగా ఉండాలి


మాట్లాడుతున్న జేఎన్‌టీయూ(ఏ) వీసీ ప్రొఫెసర్ హెచ్. సుదర్శనరావు

అనంతపురం: జేఎన్‌టీయూ అనంతపురం పరిధిలోని అటానమస్, అఫిలియేటెడ్ ఇంజినీరింగ్ కళాశాలల్లో నిజ నిర్ధారణ కమిటీల పర్యవేక్షణ పక్కాగా ఉండాలని వీసీ ప్రొఫెసర్ హెచ్. సుదర్శనరావు పేర్కొన్నారు. జేఎన్‌టీయూ అనంతపురం, పులివెందుల, కలికిరి ఇంజినీరింగ్ కళాశాల అధ్యాపకులతో వీసీ ఆన్‌లైన్‌లో మాట్లాడారు. నిజ నిర్ధారణ కమిటీలకు సంబంధించి అనుసరించాల్సిన నియమ, నిబంధనలను వివరించారు. వర్సిటీ రూపకల్పన చేసిన అన్ని అంశాలను విపులంగా పరిశీలించి అందుకు అనుగుణంగా పత్రాలను సమర్పించాలని కోరారు. ఈనెల 6, 7వ తేదీల్లో నిజ నిర్ధారణ కమిటీల పర్యవేక్షణ ఉంటుందన్నారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎస్.కృష్ణయ్య, డైరెక్టర్ ఆఫ్ అకడమిక్ అండ్ ఆడిట్ ప్రొఫెసర్ బి.దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

మొహర్రం ప్రశాంతంగా జరుపుకోండి


సర్దార్ వలి దర్గాను దర్శించుకుంటున్న జిల్లా అటవీశాఖ అధికారి విగ్నేష్ అప్పావు

ఆత్మకూరు: మొహర్రం ఉత్సవాలను ప్రజలు ప్రశాంతంగా జరుపుకోవాలని జిల్లా అటవీశాఖ అధికారి విగ్నేష్ అప్పావు సూచించారు. శనివారం ఆయన ఆత్మకూరులో పర్యటించారు. స్థానిక సర్దార్ వలి దర్గాలో చదివింపులు చేయించారు. అనంతరం గ్రామ పెద్దలతో సమావేశమై మాట్లాడారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించుకోవాలని సూచించారు. మొక్కలు నాటడం వల్ల పర్యావరణం కాలుష్యం కాకుండా వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండుతాయన్నారు. కార్యక్రమంలో అటవీశాఖ అధికారులు మధుబాబు, పవన్, శ్రీకాంత్, ప్రవీణ్, రామ్మోహన్ పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డేదీ?

నగరంలో విచ్చలవిడిగా వ్యభిచారం
- కొన్ని లాడ్జీల్లోనూ కార్యకలాపాలు
- పేదరికాన్ని ఆసరాగా తీసుకుని మహిళలను ఊబిలోకి దింపుతున్న నిర్వాహకులు
- చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న పోలీసులు



అనంతపురం: నగరంలో అసాంఘిక కార్యకలాపాలు పెచ్చుమీరాయి. పేద కుటుంబాల యువతులకు డబ్బు ఆశ చూపి వ్యభిచార రొంపిలోకి దింపుతున్నారు. నిర్వాహకుల మాటలు నమ్మి వచ్చిన వారిని నరకకూపంలోకి నెడుతున్నారు. ఇందులోకి దిగాక.. తిరిగి వెనక్కి వెళ్లలేక.. కుటుంబ కష్టాలే గుర్తుకు తెచ్చుకుని, ఇష్టం లేకున్నా మనసు చంపుకుని నిర్వాహకులు ఎలా చెబితే అలా నడుచుకోవాల్సి వస్తోంది. చదువు రాకపోవడం, ఎవరితోనూ బాధలు చెప్పుకోలేని నిస్సహాయ స్థితి.

నెలన్నర వ్యవధిలోనే అనేక కేసులు..

ఈనెల 30న అనంతపురంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో ఉప్పర లలిత అనే మహిళ నిర్వహిస్తున్న వ్యభిచార గృహంపై పోలీసులు దాడి చేశారు. ఓ బాధితురాలిని కాపాడారు. నిర్వాహకురాలిపై కేసు నమోదు చేశారు. ఇదే కాలనీలో జూన్ 19న సాయంత్రం 7.30 గంటల సమయంలో వ్యభిచార గృహంపై పోలీసులు రైడ్ చేసి నిర్వాహకురాలు కే.లక్ష్మిని అరెస్ట్ చేసి, ఓ బాధితురాలిని కాపాడారు. అంతకు ముందు కొన్ని రోజులు అంటే జూన్ 12న హౌసింగ్ బోర్డులోనే ఓ వ్యభిచార గృహంపై దాడులు చేశారు. నిర్వాహకులు కుమ్మర లక్ష్మి, బోయ వనితను అరెస్టు చేసి ఇద్దరు బాధితులను కాపాడారు. అదే రోజు హౌసింగ్ బోర్డులోనే వ్యభిచార గృహాన్ని నిర్వహిస్తున్న రామాజీ, మేరీ సుజాత, సరస్వతి అలియాస్ సాలమ్మ, విటులు జి. బాబావలి, గార్లదిన్నె లక్ష్మీనారాయణను అరెస్ట్ చేశారు. ఓ బాధితురాలిని కాపాడారు. మే 11న హౌసింగ్‌బోర్డు ఎల్‌ఐజీ బస్టాండు సమీపంలో ఒక ఇంట్లో వ్యభిచార గృహాన్ని నిర్వహిస్తున్న ఆకుల నారాయణమ్మ, విటుడు అజయ్ కుమార్‌ను అరెస్ట్ చేశారు. ఇద్దరు బాధితులను రక్షించారు. అనతికాలంలోనే ఇన్ని కేసులు నమోదయ్యాయంటే నగరంలో పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.

19–25 ఏళ్లలోపు వారే టార్గెట్..

ఒక వైపు పోలీసులు వ్యభిచార స్థావరాలపై దాడులు చేసి విటులు, నిర్వాహకులను అరెస్ట్ చేస్తున్నా అక్రమ కార్యకలాపాలు ఎప్పటిలాగానే నడుస్తున్నాయి. హైటెక్ హంగులతో యథేచ్ఛగా వ్యభిచారం నిర్వహిస్తూ నిర్వాహకులు పోలీసులకు అనుమానం రాకుండా జాగ్రత్తపడుతున్నారు. 19–25 ఏళ్ల లోపు ఉన్న యువతులనే ఈ ఊబిలోకి దింపుతున్నారు.

కస్టమర్లతో వాట్సాప్ గ్రూపులు..



నిర్వాహకులు తమ పర్మినెంట్ కస్టమర్లతో ఒక ప్రత్యేక వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేసి అందులోనే యువతుల ఫొటోలు పోస్ట్ చేసి విటులను ఆకర్షిస్తూ వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు తెలిసింది. ఎవరికీ అనుమానం రాకుండా కొందరు భార్యాభర్తలు కలిసి యువతులతో అక్రమ దందాను కొనసాగిస్తున్నారు. కొందరు ప్రముఖుల వద్దకే యువతులను పంపిస్తున్నారు. నగరంలో కొన్ని లాడ్జీలు కేవలం వ్యభిచార కార్యకలాపాల కోసమే నడిపిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. పోలీసులు నిఘాను కట్టుదిట్టం చేసి అసాంఘిక కార్యకలాపాలను అరికట్టాలని నగరవాసులు కోరుతున్నారు. రాత్రి వేళ గస్తీని తీవ్రతరం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

చంద్రబాబు మోసాలను తెలియజేద్దాం


మాట్లాడుతున్న తోపుదుర్తి రాజశేఖర్ రెడ్డి

రాప్తాడు: కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేసిన మోసాలను వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఇంటింటికీ వెళ్లి తెలియజేయాలని పార్టీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు తోపుదుర్తి రాజశేఖర్ రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం అనంతపురంలోని మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి క్యాంపు కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ గ్రామ, మండల, జిల్లా, అనుబంధ కమిటీలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల ముందు చంద్రబాబు, పవన్ కళ్యాణ్ సూపర్ సిక్స్ పేరుతో హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని పట్టించుకోవడం లేదన్నారు. చంద్రబాబు నాయుడు, పవన్ కల్యాణ్ మాటలు నమ్మి తాము మోసపోయామని ప్రజలకు స్పష్టంగా అర్థమైందన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోవడం ఖాయమని టీడీపీ నాయకులే చెబుతున్నారన్నారు. సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయలంటూ ప్రజలు ఒత్తిడి చేస్తుండటంతో రానున్న రోజుల్లో కూటమిలోని నాయకులు ఒయట తిరగలేని పరిస్థితి వస్తుందన్నారు. త్వరలోనే రాప్తాడు నియోజకవర్గంలో రీకాల్ చంద్రబాబు మేనిఫెస్టో కార్యక్రమం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. పార్టీ శ్రేణులు, తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వలంటీర్ల విభాగం శ్రీ సత్యసాయి జిల్లా అధ్యక్షుడు హరినాథ్ రెడ్డి, వైస్ ఎంపీపీ బోయ రామాంజినేయులు, మండల కన్వీనర్ సాకే వెంకటేష్, మాజీ మండల కన్వీనర్ జూటూరు శేఖర్, యూత్ మండల కన్వీనర్ బుద్దా రెడ్డి గారి విశ్వనాథ్ రెడ్డి, మాజీ యూత్ మండల కన్వీనర్ చిట్రెడ్డి సత్యనారాయణ రెడ్డి పాల్గొన్నారు.

పేద విద్యార్థికి ఆర్థిక చేయూత


విద్యార్థికి చెక్కు అందజేస్తున్న సినీ నటుడు సుమన్, చిత్రంలో రమేష్‌గౌడ్ తదితరులు

అనంతపురం కార్పొరేషన్: ఓ పేద విద్యార్థికి ఈడిగ సంఘం అండగా నిలిచింది. వివరాలు.. నగరంలోని నాలుగో రోడ్డుకు చెందిన రంగనాథ్ కుమారుడు భానుప్రకాష్ గౌడ బెంగళూరులో విద్యనభ్యసిస్తున్నాడు. ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్న రంగనాథ్ కుటుంబానికి ఈడిగ సంఘం అందించిన రూ.1.20 లక్షల చెక్కును సినీ హీరో సుమన్ చేతుల మీదుగా శనివారం అందజేశారు. ఈ సందర్భంగా సినీనటుడు సుమన్ మాట్లాడుతూ.. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి రమేష్‌గౌడ్ చేస్తున్న కృషి స్ఫూర్తిదాయకమన్నారు. ఆయనకు తమ సంపూర్ణ సహకారం ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి, జిల్లా టాస్క్‌ఫోర్స్ సభ్యులు రమేష్‌గౌడ్, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు వీబీ భాస్కర్ బాబు, నాయకులు పాలచర్ల ఆదినారాయణ, ఈశ్వరయ్య, కుమార్ గౌడ్, నాగేశ్వర రావు, హరిబాబు, స్వరూప్ కుమార్ గౌడ్, రామ్మోహన్ గౌడ్, రఘురామయ్య గౌడ్, రమణయ్య గౌడ్, కేశవ భరత్, హిద్దూ, కిరణ్, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

డ్రైల్యాండ్ హార్టికల్చర్‌ను వేగవంతం చేయండి

అనంతపురం టౌన్: ఉపాధి హామీ పథకంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా డ్రైల్యాండ్ హార్టికల్చర్‌ను వేగవంతం చేయాలని పంచాయతీ రాజ్ కమిషనర్ కృష్ణతేజ అధికారులను ఆదేశించారు. శనివారం జిల్లా నీటియాజమాన్య సంస్థ అధికారులతో జూమ్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 8న రాష్ట్ర వ్యాప్తంగా డ్రైల్యాండ్ హార్టికల్చర్ ప్లాంటేషన్ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. అందులో భాగంగానే జిల్లాలో విస్తృతంగా ప్లాంటేషన్ కార్యక్రమాన్ని చేపట్టాలని ఆదేశించారు. జిల్లాలో 5వేల ఎకరాల్లో ఈ ఏడాది హార్టికల్చర్ అభివృద్ధి చేయాలన్న లక్ష్యానికి చేరువ కావాలన్నారు. రైతుల ఆసక్తి ఉన్న పండ్ల మొక్కలను ప్రభుత్వమే సరఫరా చేస్తుందన్నారు. దీనితోపాటు రైతులే నేరుగా మొక్కలు కొనుగోలు చేసిన ప్రభుత్వం నేరుగా రైతుల ఖాతాల్లోనే నిధులను జమ చేస్తుందన్నారు. కార్యక్రమంలో డ్వామా పీడీ సలీంబాషాతోపాటు ఏపీడీలు పాల్గొన్నారు.

సమయపాలన పాటించకపోతే చర్యలు


అంగన్‌వాడీ కేంద్రం ఆవరణలో మొక్కలు నాటుతున్న ఐసీడీఎస్ పీడీ నాగమణి

రాప్తాడు: అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు సమయపాలన పాటించాలి. సమయ పాలన పాటించని వారిపై శాఖా పరమైన చర్యలు తప్పవని ఐసీడీఎస్ పీడీ నాగమణి హెచ్చరించారు. శనివారం మండలంలోని గంగలకుంట, రాప్తాడులోని అంగన్‌వాడీ కేంద్రం–2ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా ఆయా కేంద్రాల్లో రికార్డులతో పాటు ఫుడ్ స్టాక్‌ను పరిశీలించారు. పిల్లలతో రెయిమ్స్ చెప్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అందజేసే పౌష్టికాహారం పక్కదారి పట్టకుండా పారదర్శకతకు పెద్దపీట వేసేందుకు కేంద్ర మహిళా శిశు సంక్షేమ శాఖ ముఖ ఆధారిత గుర్తింపు ద్వారా పౌష్టికాహారం పంపిణీ చేసేందుకు శ్రీకారం చుట్టిందన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు అమలు చేస్తున్న ముఖ ఆధారిత హాజరుపై నిర్లక్ష్యం వహించకుండా ప్రతి ఒక్కరూ నమోదు చేయాలన్నారు. పని వేళల్లో రోజూ ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు కేంద్రాల్లో అందుబాటులో ఉండాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీఓ ఉమా శంకరమ్మ, సూపర్‌వైజర్ నాగరత్న, అంగన్‌వాడీ కార్యర్తలు తదితరులు పాల్గొన్నారు.

అధికారుల నిర్ణయాలతో ఆర్టీసీ కుదేలు


ప్రభుత్వానికి వ్యతిరేకంగా ధర్నా చేస్తున్న ఆర్టీసీ యూనియన్ నాయకులు

అనంతపురం క్రైం: ఆర్టీసీ పరిరక్షణతో పాటు కార్మికుల సంక్షేమాన్ని విస్మరిస్తే తీవ్రమైన పరిణామాలు చూడాల్సి వస్తుందని ఎంప్లాయీస్ యూనియన్ నేతలు హెచ్చరించారు. శనివారం స్థానిక ఆర్టీసీ డిపో ఎదుట రెండో రోజు కార్మికులతో కలసి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఎంప్లాయీస్ యూనియన్ డిపో అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.హెచ్.ఆర్ ఖాన్, సోమశేఖర రెడ్డి, కొండయ్య, విశ్వనాథరెడ్డి మాట్లాడుతూ.. కాలం చెల్లిన బస్సుల బ్రేక్ డౌన్‌కు గ్యారేజీ సిబ్బందిని బాధ్యులను చేసి అక్రమ చార్జ్ షీట్లు ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. క్లరికల్ సిబ్బంది, సూపర్‌వైజర్స్ ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కోరితే స్పందించడం లేదన్నారు. విలీనానికి ముందున్న ఇన్సెంటీవ్ స్కీమ్స్ యథావిధిగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీ ఉద్యోగులకు అందుబాటులో ఉన్న సీసీఎస్ ఆఫీసును బస్టాండుకు ఎనిమిది కిలోమీటర్ల దూరం తరలించాలన్న నిర్ణయాన్ని తక్షణం మార్చుకోవాలని కోరారు. డిప్యూటేషన్ల బదిలీలపై ఉన్న ఉద్యోగులు విల్లింగ్ మేరకు వన్‌టైమ్ మేజర్ కింద శాశ్వత బదిలీలు ఇవ్వాలన్నారు. డబుల్ డ్యూటీలు చేసే సిబ్బందికి ఇచ్చే డీడీల అమౌంట్‌ను పెంచాలన్నారు. పెండింగ్‌లో ఉన్న డీఏ బకాయిల ఊసే మరిచిపోయారని మండిపడ్డారు. తక్షణం బకాయిలు చెల్లించాలన్నారు. టిమ్స్ డ్యామేజైతే సంస్థ సదరు ఉద్యోగి నుంచి చేస్తున్న రికవరీలను తక్షణం ఆపాలని సూచించారు. సర్క్యులర్ 01/2019 యథావిధిగా అమలయ్యేలా ఆదేశాలు చేయాలన్నారు. ఆరేళ్లుగా పెండింగ్‌లో ఉన్న పదోన్నతులను ఇవ్వాలని కోరారు. ఎలక్ట్రిక్ బస్సులను సంస్థే సొంతంగా కొనుగోలు చేయాలన్నారు. ఆర్టీసీలో అపరిష్కృతంగా ఉన్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపాలన్నారు. లేని పక్షంలో ఉద్యమాలకు శ్రీకారం చుడతామన్నారు. గోపాల్‌రెడ్డి, డి.ఓబులరత్నం. నాగభూషణం, శివా, శీనా, పీటర్ తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్ల ఏర్పాటు సిగ్గుచేటు


మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్


సబ్ స్టేషన్ ఎదుట ఆందోళన చేస్తున్న నాయకులు

అనంతపురం టౌన్: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీకి విరుద్ధంగా పెంచిన విద్యుత్ చార్జీలు వెంటనే తగ్గించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్ డిమాండ్ చేశారు. శనివారం విద్యుత్ చార్జీల పెంపునకు నిరసనగా నగరంలోని విద్యుత్ కార్యాలయం ముందు సీపీఐ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. డిస్కం నష్టాల పేరిట రూ.15 వేల కోట్లకు పైగా బకాయిలను సామాన్యులపైకి నెట్టడం ఏంటని ప్రశ్నించారు. గత ప్రభుత్వంలో స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తున్న సమయంలో వాటిని పగులగొట్టాలని పాదయాత్రలో పిలుపునిచ్చిన లోకేష్ నేడు స్మార్ట్ మీటర్లు వ్యవసాయ కనెక్షన్లతోపాటు ఇళ్లకు సైతం ఏర్పాటు చేస్తున్నా ఎందుకు నోరు మెదపడం లేదని నిలదీశారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని విద్యుత్ శాఖ ఎస్ఈ శేషాద్రి శేఖర్‌కు అందజేశారు.

రాప్తాడురూరల్/రాప్తాడు/ఆత్మకూరు: 'గత ప్రభుత్వం స్మార్ట్‌మీటర్లు తీసుకొస్తుంటే అప్పటి ప్రతిపక్ష నాయకులు నారా చంద్రబాబు, నారా లోకేష్ తీవ్ర స్థాయిలో వ్యతిరేకించారు. స్మార్ట్ మీటర్లు కనిపిస్తే పగలకొట్టాలంటూ లోకేష్ పిలుపునిస్తే.. బాదుడే బాదుడు అంటూ చంద్రబాబు మాట్లాడారు. అలాంటి వారు అధికారంలోకి వచ్చిన తర్వాత స్మార్ట్ మీటర్లు ముద్దు అంటూ ఏర్పాటుకు చర్యలు తీసుకోవడం సిగ్గుచేటు' అని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి చిరుతల మల్లికార్జున మండిపడ్డారు. విద్యుత్ ఛార్జీల పెంపు, స్మార్ట్ మీటర్ల ఏర్పాటు, అదానీతో ఒప్పందాలను నిరసిస్తూ సీపీఐ అనంతపురం రూరల్ సమితి ఆధ్వర్యంలో స్థానిక బళ్లారి రోడ్డులోని విద్యుత్ సబ్ స్టేషన్ ఎదుట శనివారం ఆందోళన చేపట్టారు. ప్రభుత్వ చర్యల వలన వినియోగదారుడికి తెలియకుండానే ఛార్జీల భారం పడుతోందన్నారు. అలాగే రాప్తాడు, ఆత్మకూరు మండలాల్లో స్మార్ట్ మీటర్ల ఏర్పాటును ఉపసంహరించుకోవాలని సీపీఐ మండల నాయకులు డిమాండ్ చేశారు. చంద్రబాబు నాయుడు అధికారంలోకి వచ్చి ఏడాది కాలంలోనే నాలుగు సార్లు విద్యుత్ చార్జీలు పెంచడం జరిగిందన్నారు.

నేడు కుక్కలకు 'రేబిస్' టీకాలు

- నేడు ప్రపంచ జూనోసిస్ డే

అనంతపురం అగ్రికల్చర్: జంతువుల నుంచి మనుషులకు, మనుషుల నుంచి జంతువులకు పరస్పరం సంక్రమించే 'జూనోటిక్' వ్యాధులపై ప్రజలను అప్రమత్తం చేయడానికి ఏటా జూలై 6న ప్రపంచ వ్యాప్తంగా 'జూనోసిస్‌డే' నిర్వహిస్తున్నట్లు పశుసంవర్ధకశాఖ జేడీ డాక్టర్ టీవీ సుధాకర్ తెలిపారు. రాష్ట్ర డైరెక్టరేట్ ఆదేశాల మేరకు ఆదివారం జిల్లా వ్యాప్తంగా పశువుల ఆస్పత్రుల్లో వీధి కుక్కలు, పెంపుడు కుక్కలకు ఉచితంగా రేబిస్ వ్యాధి నిరోధక టీకాలు వేస్తామని వెల్లడించారు. జిల్లాకు 19,980 డోసులు సరఫరా చేశారని తెలిపారు. తమ కుక్కలకు ఉచితంగా టీకాలు వేయించుకోవడంతో పాటు జూనోటిక్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు.

అతిప్రేమ అనర్థదాయకం

జూనోసిస్ డే విషయానికి వస్తే... ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకలు, కుక్కలు, పిల్లులు, పిచ్చుకలు, కుందేళ్లు, పావురాలు లాంటి అన్ని రకాల మూగ జంతువులు, పశుపక్షాదుల పట్ల ప్రేమ చూపించడం మంచిదే కానీ, అతిగా చేయడం వల్ల అనర్థాలు కూడా ఉంటాయని పశుసంవర్ధక శాఖ జేడీ సుధాకర్ తెలిపారు. పెంపకంలో సరైన జాగ్రత్తలు పాటించకపోతే ప్రాణాంతక వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉందని హెచ్చరించారు. జంతువుల నుంచి మనుషులకు, మనుషుల నుంచి జంతువులకు ప్రపంచ వ్యాప్తంగా పరస్పరం 200 వరకు వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని గుర్తించారని తెలిపారు. అందులో ప్రధానంగా రేబిస్, ఆంత్రాక్స్, బర్డ్‌ఫ్లూ, స్వైన్‌ఫ్లూ, ఎబోలా, ప్లేగు, టీబీ, బ్రూసెల్లోసిస్, మెదడువాపు లాంటి ప్రాణాంతక, హానికరమైన జబ్బులు కూడా ఉన్నాయన్నారు. ఆదివారం పశువుల ఆస్పత్రుల్లో తమ పెంపుడు కుక్కలకు ఉచితంగా రేబీస్ టీకాలు వేయించుకోవాలని సూచించారు.

నేడు అనంత సాహితీ ఉత్సవం

అనంతపురం కల్చరల్: సెంట్రల్ లైబ్రరీ హాల్ వేదికగా ఆదివారం జాతీయ శతాధిక కవి సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు లేపాక్షి ఫౌండేషన్ నిర్వాహకులు పొట్లూరి హరికృష్ణ, వడ్డీ సుధాకర్, అశోక్ కుమార్ శనివారం ఓ సంయుక్త ప్రకటన విడుదల చేశారు. ఆసక్తి కలిగిన కవులు, కళాకారులు, కవయిత్రులను ప్రోత్సహించడమే లక్ష్యంగా సాహితీ ఉత్సవం సాగుతుందని పేర్కొన్నారు. పాల్గొన్న వారికి జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందజేయడం జరుగుతుందన్నారు. సాహిత్యాభివృద్ధి, సామాజికాభివృద్ధి సమాంతర లక్ష్యంగా సాగే కవి సమ్మేళనంలో అందరూ భాగస్వాములు కావాలని కోరారు.

వైభవంగా ఏడు శనివారాల వ్రతం


వ్రతం ఆచరిస్తున్న మహిళలు


పూజలు చేస్తున్న అర్చకులు

అనంతపురం కల్చరల్: నగరంలోని హౌసింగ్ బోర్డు వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం ఏడు శనివారాల వ్రతాలు ఘనంగా జరిగాయి. పెద్ద ఎత్తున తరలి వచ్చిన మహిళలు ఏకరూప వస్త్రాలతో బారులు తీరి భక్తిశ్రద్ధలతో వ్రతం ఆచరించారు. శ్రీవారి ప్రతిమలకు పసుపు, కుంకుమలు, పవిత్ర జలాలు, పుష్పాలతో పూజలు చేశారు. మధ్యాహ్నం వందలాది మందికి అన్నప్రసాద వితరణ జరిగింది. అంతకు ముందు మూలవిరాట్‌కు సుప్రభాత సేవ, తిరుమంజన, తోమాల సేవ, సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. మహామంగళ హారతి అనంతరం తీర్థప్రసాద వినియోగం జరిగింది. కార్యక్రమంలో కమిటీ సభ్యులు కేశవ చంద్రరావు, ప్రతాపరెడ్డి, శ్రీనివాసుల రెడ్డి, గోవిందు, అనిల్, బాబురావు, లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా ఆర్ఎఫ్ రోడ్డు లక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయంలో వ్రతాలు జరిగాయి.

దేశవ్యాప్త సమ్మెకు సంపూర్ణ మద్దతు


పోస్టర్లను విడుదల చేస్తున్న మెడికల్ రిప్రజెంటేటివ్ సంఘం నాయకులు

అనంతపురం అర్బన్: జాతీయ కార్మిక సంఘాలు ఈనెల 9న తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెకు సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు మెడికల్ రిప్రజెంటేటివ్స్ సంఘం నాయకులు స్పష్టం చేశారు. శనివారం స్థానిక హెచ్ఎల్‌సీ కాలనీలోని సంఘం కార్యాలయంలో సమ్మె పోస్టర్లను నాయకులు విడుదల చేశారు. ఈ సందర్భంగా సంఘం జాతీయ నాయకుడు రాజమోహన మనోహర్ మాట్లాడారు. కార్మికులు పోరాడి సాధించుకున్న చట్టాలను రద్దు చేసిన తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలన్నారు. సెల్స్ ప్రమోషన్ ఉద్యోగులకు చట్టపరమైన పని విధానాలు అమలు చేయాలన్నారు. అత్యవసర మందుల ధరలను ప్రభుత్వం తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర నాయకుడు రంగారెడ్డి, మెడికల్ రెప్స్ సంఘం నాయకులు చంద్ర, మంజు, నరేంద్ర, రామాంజి, కదిరప్ప, సరేంద్ర, శివారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

డీసీసీబీలో సహకార దినోత్సవం


ప్రతిజ్ఞ చేస్తున్న డీసీసీబీ చైర్మన్ కేశవరెడ్డి, అధికారులు

అనంతపురం అగ్రికల్చర్: స్థానిక జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ (డీసీసీబీ)లో 103వ అంతర్జాతీయ సహకార దినోత్సవం సందర్భంగా శనివారం సహకార పతాకావిష్కరణ, ప్రతిజ్ఞ చేశారు. సహకార వ్యవస్థ విశిష్టతను అధికారులు తెలియజేశారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి, జిల్లా సహకార అధికారి ఈ.ఈరుణ కుమారి, నాబార్డు డీడీఎం అనురాధ, ఆప్కాబ్ ఓఎస్‌డీ సూర్యనారాయణ ఆప్కాబ్ డీడీఎం అరుణ, డీసీసీబీ డీజీఎంలు రామ్‌ప్రసాద్, విజయచంద్రా రెడ్డి, సుఖదేవబాబు తదితరులు పాల్గొన్నారు. అలాగే రామ్‌నగర్‌లో ఉన్న రాయలసీమ సహకార శిక్షణ కేంద్రంలో విద్యాధికారి ఎంటీ మురళీమోహన్ ఆధ్వర్యంలో సహకార పతాకాన్ని ఎగురవేశారు.

అనంత చరిత్ర అద్భుతం


టీజర్‌ను విడుదల చేస్తున్న దృశ్యం

అనంతపురం కల్చరల్: అనంత రచయిత, విద్యావేత్త గిరిధర రాయ్ స్వయంగా రచించి దర్శకత్వ బాధ్యతలను చేపట్టిన 'అనంతపురం చరిత్ర' టీజర్‌ను శనివారం విడుదల చేశారు. స్థానిక వేణుగోపాల నగర్‌లో సామాజిక సేవా కార్యకర్త రవికాంత్ రమణ మాట్లాడుతూ.. శతాబ్దాల అనంత చరిత్రలో ఎన్నో ఆసక్తికరమైన సంఘటనలు, అపురూప ఘట్టాలను లఘుచిత్రంలో అద్భుతంగా చిత్రీకరించారన్నారు. తప్పకుండా అవార్డు వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. చరిత్రను చిత్రంగా మార్చిన గిరిధర రాయ్‌ను అభినందించారు. కార్యక్రమంలో పలువురు రచయితలు, సేవా కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలు అమలు చేయాలి


డిప్యూటీ కమిషనర్ డాక్టర్ పావనికి వినతిపత్రం అందిస్తున్న యూనియన్ నాయకులు

అనంతపురం కార్పొరేషన్: మునిసిపల్ కార్మికులకు ప్రభుత్వ పథకాలు అమలు చేసి, వేతనాలు పెంచేలా చర్యలు తీసుకోవాలని ఏపీ మునిసిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం నగరపాలక సంస్థ కార్యాలయంలో డిప్యూటీ కమిషనర్ డాక్టర్ పావనికి వినతిపత్రం అందించారు. ఆ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేష్‌గౌడ్ మాట్లాడుతూ.. ఇంజినీరింగ్ కార్మికులకు వేతనాలు పెంచాలని నిరసన తెలుపుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ప్రధానంగా రూ.15 వేలు వేతనం వస్తోందని తెలిపారు. ప్రభుత్వ పథకాలు మంజూరు చేయకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నగర ప్రధాన కార్యదర్శి కృష్ణుడు, మునిసిపల్ యూనియన్ జిల్లా కోశాధికారి వేణుగోపాల్, జిల్లా ఉపాధ్యక్షుడు నాగరాజు, నాయకులు ప్రసాద్, రామాంజినేయులు, నాయుడు, తదితరులు పాల్గొన్నారు.